AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
12-9-2025 (Friday)
MAIN EDITION

## రూ.52 వేలకే ఐఫోన్ 16



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** యాపిల్ ఫోన్ కొనాలనుకునే వారికి గుడ్ న్యూస్. ప్రముఖ ఈ కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ భారీ ఆఫర్లు ప్రకటించింది. ఐఫోన్ 16, 16 ప్రో మొబైల్స్‌పై మునుపెన్నడూ లేని విధంగా ఆఫర్లు ఇచ్చి ఆశ్చర్యానికి గురి చేసింది. ఫ్లిప్‌కార్ట్‌లో ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్న 'బిగ్ బిలియన్ డేస్'లో భాగంగా ఐఫోన్ 16ను రూ.51,999కే విక్రయించనుంది. అలాగే 16 ప్రో సైతం రూ.70 వేలలోపు లభించనుంది. వివిధ రకాల క్రెడిట్ కార్డులపై అదనంగా మరో 10 శాతం వరకు ఆఫర్లు ప్రకటించడం విశేషం.

## కర్నాటకలో మరోసారి కులగణన




**అక్షరటుడే, బెంగళూరు:** కర్నాటకలో కాంగ్రెస్ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మరోమారు కులగణన చేపట్టాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని సీఎం సిద్ధరామయ్య శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. "సెప్టెంబరు 22 నుంచి రాష్ట్రంలో మరోమారు కులగణన ప్రారంభమవుతుంది. 2015లో చేపట్టిన కులగణన ఆమోదయోగ్యంగా లేదు. అందుకే మరోమారు సర్వే చేపట్టాలని నిర్ణయించాం." అని సీఎం ప్రకటించారు. కాగా.. అక్టోబరు 7వ తేదీ వరకు ఈ సర్వే కొనసాగనుంది.



## రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ సహా తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం రాత్రి నుంచి పలుచోట్ల కుండపోత వర్షం కురిసింది. హైదరాబాద్ శివారు ప్రాంతాలతో పాటు పలు జిల్లాల్లో వాన దంచికొట్టింది. నగరంలోని ప్రధాన జలాశయాలైన హిమాయత్‌సాగర్, ఉస్మాన్ సాగర్ (గండిపేట)కు భారీగా వరద వస్తోంది. ఇప్పటికే ప్రాజెక్టులు నిండుకుండలా మారడంతో అధికారులు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జంట జలాశయాల నుంచి నీటిని విడుదల చేస్తుండటంతో మూసీ నది ఉధృతంగా పారుతోంది. నార్సింగి, మంచిరేవుల మధ్య ఉన్న కల్వర్టు పైనుంచి ఈ వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో అధికారులు ఆ మార్గంలో రాకపోకలు నిలిపివేశారు. పురానాపూల్ నుంచి జియాగూడ కమేలా రోడ్డును అధికారులు మూసివేశారు.

**–అక్షరటుడే, హైదరాబాద్ సిటీ**

## ఎస్‌బీఐలో కొలువులు




**అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్:** బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న వారికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శుభవార్త చెప్పింది. స్పెషలిస్ట్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 122 పోస్టులను భర్తీ చేయనుంది. అక్టోబర్ 2వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాల కోసం ఎస్‌బీఐ అధికారిక వెబ్‌సైట్ https://sbi.bank.in/web/careers ను సందర్శించాలని పేర్కొంది.

## కామారెడ్డి సభ వాయిదా

**అక్షరటుడే, కామారెడ్డి:** కాంగ్రెస్ పార్టీ ఈ నెల 15న కామారెడ్డిలో నిర్వహించ తలపెట్టిన బీసీ కృతజ్ఞత సభ వాయిదా పడింది. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సభను వాయిదా వేయాలని అధికార పార్టీ నిర్ణయించింది. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న తరుణంలో సభ నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ తలచింది. ఎక్కడైతే బీసీ డిక్లరేషన్ సభ నిర్వహించారో అక్కడే కృతజ్ఞత సభ జరపాలని నిర్ణయించగా.. వర్షాలతో వాయిదా పడింది.

బంగారం ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. రోజుకో రికార్డు సృష్టిస్తూ పైపైకి వెళ్తున్నాయి. శుక్రవారం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1.12 లక్షలకు చేరువైంది. రోజురోజుకు గోల్డ్ రేట్ పరుగులు తీస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ధరలిలా పెరుగుతూ పోతే శుభకార్యాలకు బంగారం ఎలా అనే ఆందోళన సామాన్యుల్లో నెలకొంది. **– అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**



# పసిడి పరుగులు

**■ చుక్కలు చూపిస్తున్న బంగారం ధర ■ తులం రూ.1.12 లక్షలు**

బంగారం అంటే భారతీయులకు ఎంతో ఇష్టం. శుభకార్యాలు, పండుగల సందర్భంగా బంగారు ఆభరణాలను ధరిస్తుంటారు. వివాహాది శుభకార్యాలలో దగ్గరి బంధువులు కానుకగా బంగారం ఇస్తుంటారు. ధనత్రయోదశి రోజున చాలామంది తప్పనిసరిగా బంగారాన్ని కొనుగోలు చేస్తుంటారు. దీనిని ఆభరణాలుగానే కాకుండా పెట్టుబడిగానూ చూస్తుంటారు. గతంలో మన దేశంలోని పరిస్థితులపై ఆధారపడి ధరలు ఉండేవి. పెళ్లిళ్ల సీజన్‌లో ధరలకు రెక్కలొచ్చేవి. గ్లోబలైజేషన్ కారణంగా భారత్‌లోనూ బంగారం ధరలు గ్లోబల్ మార్కెట్లపై ఆధారపడి ఉంటున్నాయి.

బంగారం ధరలు అమాంతం పెరగడానికి అనేక కారణాలున్నాయి. ప్రధానంగా మనది పసిడి దిగుమతిపై ఆధారపడిన దేశం. ఇది ధరలు అదుపులో లేకపోవడానికి ఓ ముఖ్య కారణం. జియో పొలిటికల్ టెన్షన్స్, కరెన్సీ మార్పిడి రేట్లు, యూఎస్ ద్రవ్య విధానంవంటి కీలకమైన అంతర్జాతీయ అంశాలు ధరలను ప్రభావితం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఈక్విటీ మార్కెట్ కంటే.. బంగారం సురక్షితమైన పెట్టుబడి మార్గంగా పరిగణిస్తున్నారు. దీంతో బంగారంలో పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపుతుండడంతో పసిడి పరుగులు తీస్తోందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు.

### ఇవీ కారణాలే..

ఇటీవలి కాలంలో చాలా దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య మొదలైన యుద్ధం మూడేళ్లు దాటినా ముగింపునకు చేరుకోలేదు. ఇజ్రాయిల్ - పాలస్తీనా, ఇజ్రాయిల్ - ఇరాన్, భారత్ - పాకిస్థాన్.. ఇలా చాలా దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ టెన్షన్స్‌కు తోడు అమెరికా తీసుకునే నిర్ణయాలు కూడా బంగారం ధరలను పరుగులు పెట్టిస్తున్నాయి. ఉక్రెయిన్, రష్యాల మధ్య యుద్ధం ప్రారంభమయ్యాక యూఎస్‌తో పాటు యూరోపియన్ యూనియన్ రష్యాపై ఆంక్షలు విధించాయి. రష్యాను ఆర్థికంగా ఇబ్బందిపెట్టేందుకు ఆ దేశ రిజర్వ్‌లను స్తంభింపజేశాయి. ఒక్క డాలర్లలోనే రిజర్వ్‌లను దాచి ఉంచితే ఎప్పటికైనా ప్రమాదమేనన్న విషయం ప్రపంచ దేశాలకు దీంతో స్పష్టమైంది. ఈ నేపథ్యంలో రష్యాతో పాటు చైనా, భారత్‌లు కూడా బంగారం నిల్వలపై దృష్టి సారించాయి. బంగారాన్ని సురక్షితమైన ఆస్తిగా గుర్తించి భారీ మొత్తంలో కొనుగోలు చేస్తున్నాయి. దీంతో పసిడికి భారీ డిమాండ్ ఏర్పడి ధర గణనీయంగా పెరిగింది. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువగా అమెరికా డాలర్లలో వర్తకం సాగుతోంది. అయితే కొన్నాళ్లుగా యూఎస్ డాలర్ బలహీనపడుతూ వస్తోంది. డాలర్ ఇండెక్స్ శుక్రవారం 97.56 కు పడిపోయింది. డాలర్ విలువ తగ్గుతుండడంతో ఇతర దేశాలు ప్రత్యామ్నాయంగా బంగారం వైపు చూస్తున్నాయి. దీంతో పుత్తడికి డిమాండ్ పెరిగింది. బంగారం ధర పెరగడానికి ఇవి కూడా కారణంగా చెప్పవచ్చు.



ఉప రాష్ట్రపతిగా

## రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం


**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** భారతదేశ 15వ ఉప రాష్ట్రపతిగా చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాధాకృష్ణన్‌తో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తదితరులు పాల్గొన్నారు. ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన ధన్‌ఖడ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## హైదరాబాద్‌లో ఈడీ సోదాలు




**అక్షరటుడే, హైదరాబాద్:** నకిలీ ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కుంభకోణంలో ఈడీ అధికారులు విచారణ వేగవంతం చేశారు. దేశంలోని పలు ప్రాంతాల్లో దాడులు చేపడుతున్నారు. నకిలీ ఐటీసీ స్కాంపై గురువారం సోదాలు ప్రారంభించిన ఈడీ అధికారులు.. తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల్లో తనిఖీలు చేపడుతున్నారు. శుక్రవారం కూడా హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలో ఈడీ బృందాలు తనిఖీలు చేశాయి. రూ.కోట్ల వ్యాపారం చేసినట్లు ఫేక్ ఇన్వాయిస్‌లు సృష్టించి షెల్ కంపెనీల ద్వారా రూ.650 కోట్లు బదిలీ చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసులో ఇప్పటికే శివకుమార్ అనే వ్యక్తిని అధికారులు అరెస్ట్ చేశారు. ఆయనే ప్రధాన సూత్రధారుడిగా ఈడీ గుర్తించింది.

## బాంబు బెదిరింపుల కలకలం




**అక్షరటుడే, ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబైలలో బాంబు బెదిరింపు మెయిల్స్ ఘటన కలకలం సృష్టించింది. ఢిల్లీ, ముంబై హైకోర్టులకు ఆగంతకులు బాంబు బెదిరింపు మెయిల్స్ పంపించారు. కోర్టు గదుల్లో పేలుడు పదార్థాలు అమర్చారని పేర్కొన్నారు. మధ్యాహ్నంలోగా కోర్టును పేల్చేస్తామని అందులో ఉంది. కోర్టులోని మూడు ప్రాంతాల్లో ఆర్డీఎక్స్‌లు అమర్చామని పేర్కొన్నారు. తమకు పాకిస్తాన్, ఐసిస్‌తో సంబంధాలున్నట్లు మెయిల్‌లో నిందితులు పేర్కొన్నారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు కోర్టు ఆవరణలో తనిఖీలు చేపట్టారు. బాంబు ఆనవాళ్లు ఏమీ లభ్యం కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## యూఎస్‌లో ఎన్ఆర్ఐ హత్య

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికాలో ఒళ్లు గగుర్పొడిచే దారుణ ఘటన చోటుచేసుకుంది. భారత సంతతి వ్యక్తిని ఓ కసాయి దారుణంగా హతమార్చాడు. డల్లాస్‌లోని డౌన్‌టౌన్‌లో గల ఓ లాడ్జిలో చంద్రమౌళి నాగమల్లయ్య (50) పనిచేస్తున్నాడు. కాగా.. చంద్రమౌళికి మార్టినెజ్ అనే వ్యక్తితో వాషింగ్ మిషన్ విషయంలో గొడవ జరిగింది. ఈ క్రమంలో మల్లయ్యపై మార్టినెజ్ పదునైన ఆయుధంతో దాడికి దిగాడు. మల్లయ్య తల నరికి విసిరికొట్టాడు. ఘటనాస్థలికి చేరుకున్న డల్లాస్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

## భారత్‌ను చైనాకు దూరం చేయడమే మా టార్గెట్..: అమెరికా



**అక్షరటుడే, వెబ్‌డెస్క్ :** సుంకాలతో భారత్‌ను భయపెట్టాలని చూసిన అమెరికా వెనక్కి తగ్గింది. భారత దౌత్య నీతి ముందు అగ్రరాజ్యం బెదిరింపులు పని చేయలేదు. రష్యా నుంచి ఆయిల్, ఆయుధాలు కొనుగోలు చేస్తుందనే కారణంతో డోనాల్డ్ ట్రంప్ భారత్‌పై 50శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. దీంతో కేంద్ర ప్రభుత్వం అమెరికా చర్యలకు ఏ మాత్రం వెరవకుండా.. రష్యాతో బంధాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా అడుగులు వేసింది. అంతేగాకుండా చైనాతో కూడా సంబంధాలను పునరుద్ధరించింది. దీంతో భారత్ - రష్యా - చైనా మూడు దేశాలు కలిస్తే తమకు ప్రమాదం అని భావించిన అమెరికా వెనక్కి తగ్గింది. ఈ మేరకు భారత్‌తో చర్చలకు సిద్ధమని ఇటీవల ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా భారత్ - అమెరికా మధ్య సంబంధాలపై యూఎస్ రాయబారి సెర్గీ గోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌ను చైనాకు దూరం చేసి, అమెరికాకు దగ్గర చేయడమే తమ టార్గెట్ అని ఆయన పేర్కొన్నారు. ఇండియాను యూఎస్ వైపు తీసుకురావడం ముఖ్యమైన విషయమని చెప్పారు. తమ పెట్రోలియం ఉత్పత్తుల కోసం భారత్ ప్రధాన మార్కెట్ కావాలని చూస్తున్నట్లు చెప్పారు. ఇరుదేశాల మధ్య చర్చలతో అడ్డంకులు తొలగిపోతాయని గోర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఏపీ లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం

**అక్షరటుడే, ఏపీ డెస్క్:** ఏపీ లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి సెల్‌ఫోన్‌ను ఎఫ్ఎస్ఎల్‌కు పంపేందుకు ఏసీబీ కోర్టు అనుమతించింది. ఈ మేరకు శుక్రవారం ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. ఇప్పటికే ఈ కేసులో నారాయణస్వామిని విచారించిన సిట్ కాల్ డేటా సహా బ్యాంకు లావాదేవీలకు సంబంధించి కీలక వివరాలు సేకరించింది. కాగా.. నారాయణస్వామి మొబైల్ ఆధారంగా దర్యాప్తు చేస్తే మరిన్ని ఆధారాలు లభిస్తాయని సిట్ భావిస్తోంది. నారాయణ స్వామి జగన్ ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.




## అనుష్క సంచలన నిర్ణయం

ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన అనుష్క శెట్టి ప్రస్తుతం టఫ్ ఫేజ్ ఎదుర్కంటోంది. ప్రస్తుతం ఆమె నటించిన సినిమాలు అంత విజయం సాధించడం లేదు. ఇటీవల ఘాటి చిత్రంతో ప్రేక్షకుల ముందుకురాగా.. అంతగా ఆకట్టుకోలేకపోయింది. వారం రోజుల్లోనే ఈ మూవీని థియేటర్స్ నుండి తీసేసారు. ఈ నేపథ్యంలో అనుష్క శెట్టి తన అభిమానులను ఆశ్చర్యంలో ముంచెత్తే నిర్ణయం తీసుకున్నారు. తాను కొంతకాలం పాటు సోషల్ మీడియా నుంచి విరామం తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని ఆమె తన చేతిరాతతో రాసిన ఒక నోట్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

**– అక్షరటుడే, సినిమా డెస్క్**

